# సంప్రదాయం

విశ్వనాథం చాలాసేపట్నుంచి దీర్ఘాలోచనలో ఉన్నాడు. అందుకని అతడి భార్య సరోజ కూడా అతడిని పలకరించడంలేదు. అయితే అతడాలోచిస్తున్న విషయం సరోజకు తెలుసు.

మురళికి ఉద్యోగం వచ్చింది. అదీ మామూలు ఉద్యోగం కాదు. ఆరంభంలోనే నెలకు మూడు వేల అయిదొందలు. కంపెనీయే యిల్లిస్తుంది. కంపెనీయే కారిస్తుంది. ఎటొచ్చీ ఉద్యోగం ఇక్కడ కాదు.. పూనాలో.

పూనా రాజమండ్రికి పెద్ద దూరం కాదు. అందులోనూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వచ్చేక బాగా దగ్గరకూడా అయింది. అయితే విశ్వనాథమూ, ఆ యింట్లో తదితరులూ భయపడుతున్న విషయం వేరే ఉంది.

ఆ యింట్లో విశ్వనాథం బామ్మ, తాతగారు ఎనభయ్యోవడిలో ఉన్నారు. విశ్వనాథం తల్లిదండ్రులు అరవయ్యోపడిలో ఉన్నారు. విశ్వనాథానికి ముప్పై అయిదేళ్ళు. ఆ యింటి మొత్తానికి నెలకింతంటూ సంపాదిస్తున్నది విశ్వనాథం ఒక్కడే. అయితే ఆ విషయమై అతడు కానీ, అతడి భార్య కానీ రవంత కూడా బాధపడలేదు. ప్రస్తుతం విశ్వనాథం తల మునిగే అప్పుల్లో ఉన్నాడు. అందుక్కారణం ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళతో పాటు మురళి చదువు కూడా.

మురళికి బాగా చదువబ్బింది. అందుకని ఎంత ఖర్చయినా చదివించాలని విశ్వనాథం పట్టుబట్టాడు. విశాఖపట్నం హాస్టల్లో ఉండి మురళి చదువుకున్నాడు. ఒక్కరోజు కూడా విశ్వనాథం అతణ్ణి డబ్బు కిబ్బంది పడనివ్వలేదు.

మురళి ఇంజనీరింగ్ సగంలో ఉండగానే ఒక కంపెనీ ఇంటర్వ్యూ చేసింది. సెలక్టయిన పది మంది విద్యార్థుల్లోనూ అతనూ ఉన్నాడు. అతడి ఇంజనీరింగ్ చదువుతోపాటు కంపెనీ ప్రత్యేక శిక్షణ తోడయింది. చదువు పూర్తయిన వెంటనే మురళికి ఉద్యోగం వచ్చింది. అంతవరకూ బాగానే ఉంది.

వారి కుటుంబం ఆది నుంచీ సంప్రదాయాన్ని నమ్ముకుంది. వారింట్లో ఎవ్వరూ కాఫీ, టీ తాగరు. అంతా ఉదయమే లేచి స్నానం చేసి దైవపూజ చేసుకున్నాకనే ఏమైనా తింటారు. అన్ని విషయాల్లోనూ పిల్లలు పెద్దల మాట వినాలి.

మురళి మాత్రం చిన్నతనం నుంచీ భిన్నంగా ఉంటున్నాడు. పరిశుభ్రత, క్రమశిక్షణల కోసమే మంచి అలవాట్లు తప్ప దేవుడి కోసం, పుణ్యం కోసం కాదంటాడు. ఆడ - మగ ఇద్దర్నీ సమంగా చూడాలంటాడు. కుల మతాలు తప్పంటాడు. పెళ్ళి చేసుకుంటే కట్నం తీసుకోనంటాడు. ఉన్నాడోలేదో తెలియని దేవుడి కోసం సమయం వృధా చేయకూడదంటాడు. ఈ విషయమై అందరితోనూ వాదనకు దిగుతాడు. పెద్దల మాటైనా వాదనకు, తర్కానికి ఆగితేనే వింటానంటాడు.

ఇంట్లోని పెద్దలంతా ఒక్కటై అతడికి నచ్చజెప్పాలని చూసేవారు. అతడితో వాదించి నెగ్గలేక కుర్రతనంలే అని సరిపెట్టుకునేవారు. అయితే ఆ కుర్రవాడిప్పుడు నెలకు

మూడువేలయిదొందల రూపాయల జీతంతో పెద్ద ఉద్యోగస్తుడయ్యాడు. కుర్రతనంతో సంప్రదాయాలన్నీ వ్యతిరేకిస్తాడేమోనని అంతా భయపడుతున్నారు. అందుకు ముఖ్య కారణం ముగ్గురమ్మాయిలు.

ఒకామె భారతి. దూరపు వరసలో మురళికి మరదలవుతుంది. భారతి అందాన్ని ఎరగా చూపి పైసా కట్నం లేకుండా పెళ్ళి చేయాలని ఆమె తలిదండ్రులనుకుంటున్నారని ఆ యింట్లో అందరూ అనుకుంటున్నారు.

రెండో ఆమె సునంద. మురళికి చిన్నతనంలో స్నేహితురాలు. సునంద తండ్రి చిన్నప్పట్నించీ మురళిని 'అల్లుడూ' అని పిలవడమే కాక, "మీ వాడివి స్వతంత్ర భావాలు. పెద్దయ్యాక నా కూతుర్నే పెళ్ళిచేసుకుంటాడు." అనేవాడు. వాళ్ల కులం వేరు. తక్కువ కులం వాళ్ళని మురళి తాత వాళ్ళతో మాట్లాడేవాడు కాదు. మూడో ఆమె రజియా. చాలా అందంగా ఉంటుంది. రజియాకు చిన్నప్పుడు మురళి ప్రైవేటు కూడా చెప్పేవాడు. ఆమె ముస్లిం అయినా హిందూమతంలోని పురాణ కథలన్నీ తెలుసు. అది తెలిసి మురళి పట్టుదలగా తనూ ఖురాన్ చదివాడు. ఆమె సంస్కారాన్ని తరచుగా ఇంట్లో పొగుడుతూండేవాడు.

ఇబ్బంది ఏమిటంటే ప్రస్తుతం ముగ్గురూ పూనాలోనే ఉంటున్నా రు. ముగ్గురిలో ఏ ఒక్కరైనా వల విసిరి మురళిని పట్టేస్తారని ఇంట్లో అంతా భయపడుతున్నారు. అలాగని మురళిని పూనా పంపకుండా ఉండలేరు.

ఇంటిల్లిపాదీ ఒక రాత్రంతా చర్చించారు. సంప్రదాయం గురించి మురళికెలా నచ్చచెప్పాలో ఆలోచించారు. ఆ ఆలోచనలను మురళికి సక్రమంగా చెప్పే బాధ్యత విశ్వనాధానికిచ్చారు.

విశ్వనాథం వెంటనే మురళికి చెప్పలేదు - తన భావాలకు ఎదురు చెప్పే వ్యవధి ఉండకూడదు మురళికి.

కొద్ది గంటల్లో మురళి ప్రయాణం.

అతడికి సంప్రదాయం గురించి ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు విశ్వనాథం. అతడాలోచిస్తూండగానే ప్రయాణం గంటల్లోంచి గంటలోకి వచ్చింది.

విశ్వనాథం ఆలోచన కట్టిపెట్టి, "సరోజా!" అన్నాడు. అతడి పిలుపు కోసమే ఎదురుచూస్తున్నట్లు సరోజ క్షణాల మీద ప్రత్యక్షమయింది.

"మురళిని పిలు!" అన్నాడతడు.

కొద్ది క్షణాల్లో మురళి అతడి ముందున్నాడు.

'మురళీ! పెద్ద ఉద్యోగస్తుడివై పూనా వెడుతున్నావు. నీ బాధ్యతలు నీకు తెలుసుగా..' అన్నాడు విశ్వనాథం.

"తెలుసన్నయ్యా! ఇరవై వేల రూపాయల అప్పుంది నీకు. ఒక్క ఏడాదిలో ఇది తీరిపోతుంది చూడు.." అన్నాడు మురళి.

"చాలా సంతోషంరా.. అయితే నీ బాధ్యత అప్పులు తీర్చడంలోకంటే సంప్రదాయాన్ని పాటించడంలోనే ఎక్కువగా చూపించాలి."

"ఏ సంప్రదాయంలోనైనా సరే..మంచిని తీసుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఉంటాను." అన్నాడు మురళి.

"నాకా విషయం తెలుసు. అందుకే మన సంప్రదాయంలోని మంచిని చెబుతున్నాను విను..." అంటూ ప్రారంభించాడు విశ్వనాథం.

హిందూమతం గురించీ, సంప్రదాయం ఔన్నత్యం గురించీ స్వానుభవంతో చెప్పే పెద్దల మాట విలువ గురించీ, కులవ్యవస్థ గురించీ విశ్వనాథం కొద్దిసేపు ఉపన్యసించేడు. ఆఖరి మాటగా వరకట్న సంప్రదాయం మీద ఆయన తన అమూల్యాభిప్రాయాన్ని తమ్ముడి ముందు ఉద్ఘోషించాడు.

"పెళ్ళికి కట్నం తీసుకోవడం తప్పుకాదు. ఉన్నవాడిలో త్యాగబుద్ధిని పుట్టించి లేనివాడి ఆర్థిక పరిస్థితిని బాగుచేసే చక్కటి సంప్రదాయం అది. మనిషి తన కుటుంబం కోసమేకాక తన కులానికి చెంది న మరో కుటుంబపు వ్యక్తి ఆర్థిక పరిస్థితిని మెరుగుచేయడానికి పాటుపడేలా చేసే అపూర్వ సంప్రదాయమది. ఒకనాడు మనిషికున్న త్యాగబుద్ధి ఈనాడు లేక ఈ సంప్రదాయాన్ని నిరసించడం జరుగుతోంది".

మురళి అన్నగారు చెప్పిందంతా మౌనంగా విన్నాడు. బదులు చెప్పలేదు.

అతడెదురుచెప్పలేదని విశ్వనాథం చాలా సంతోషించాడు.

మురళి బయల్దేరే సమయం వచ్చింది.

రిక్షాలో సామాన్లు పెట్టేక మురళి తాతగారికీ, బామ్మకూ, తలి దండ్రులకూ, అన్నా వదినెలకూ పాదాభివందనం చేశాడు.

అతడి వినయానికి యింటిల్లపాదీ సంతోషించారు.

రాత్రి నిద్ర కూడా పోకుండా ఆలోచిస్తూ కూర్చున్న తన శ్రమ వృథా కాలేదని విశ్వనాథం మరింత సంతోషించాడు.

స్టేషన్‌కు విశ్వనాథం, సరోజ వెళ్లారు.

ట్రయిన్ కదిలేముందు విశ్వనాథం తమ్ముడితో.."వదినతో సహా యింట్లోని పెద్దలందరికీ పాదాభివందనం చేశావు. ఇందరి దీవెనలు నిన్నింకా ఎంతో వృద్ధిలోనికి తీసుకునివెడతాయి" అన్నాడు.

"అన్నయ్యా నేను పాదాభివందనం చేసింది దీవెన కోసం కాదు.." అన్నాడు మురళి.

విశ్వనాథం గుండె గుభేల్మంది. "కొంపదీసి ముందు చేయబోయే తప్పులకీరోజే క్షమార్పణ అడిగేవా?" అన్నాడు.

"అదికాదన్నయ్యా. నువ్వు చెప్పినవాటిల్లో నాకు నచ్చిందీ పాటించగలిగిందీ ఆ సంప్రదాయం ఒక్కటే!" అన్నాడు మురళి.

పెద్ద కూతతో ట్రయిన్ కదిలింది.

తమ్ముడు తనకేకాక సంప్రదాయాలకు కూడా దూరంగా వెళ్ళిపోతున్నాడన్న అనుభూతి అప్పుడు కలిగింది విశ్వనాథానికి. ★

*(యువ మాస పత్రిక - నవంబరు, 1988)*